నిధులు మంజూరైనా..

- యాచారం దవాఖాన భవన నిర్మాణం కలేనా..?
- నెర్రెలుబారి, సీకులుదేలి.. శిథిలావస్థకు చేరిన పాత భవనం
- శిలాఫలకానికే పరిమితమైన నూతన నిర్మాణం
- ఇబ్బందుల్లో సిబ్బంది, రోగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

యాచారం ప్రభుత్వ దవాఖాన పాత భవనం

యాచారం, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ప్రాథమిక స్థాయి నుంచి రాష్ట్ర వైద్యవిధాన పరిషత్‌కు మారినప్పటికీ దవాఖానకు మాత్రం మంచి రోజులు రావడంలేదు. ఎన్నో ఏండ్ల క్రితం నిర్మించిన భవనం క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవతో నూతన భవన నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆగస్టు 17, 2023న మాజీ మంత్రి హరీశ్‌రావు నూతన దవాఖాన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అధికారులు, కాంట్రాక్టర్లు అటు వైపు చూసిన పాపాన పోలేదు. అసౌకర్యాలతో శిథిలావస్థకు చేరిన భవనంలో వైద్యులు, సిబ్బంది, రోగులు నరకం చవిచూస్తున్నారు. భవన నిర్మాణంలో నిర్లక్ష్యం వీడి వెంటనే నిర్మాణ పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ..

యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ దవాఖానాకు ఎంతో చరిత్ర ఉన్నది. ఒకప్పుడు విశాలమైన భవనంతో 30 పడకల దవాఖానా భవనం ప్రజలకు అందుబాటులో ఉండేది. దీంతో మండలవాసులే కాకుండా మంచాల, కందుకూరు, కడ్తాల, ఆమనగల్లు, చింతపల్లి, మర్రిగూడ, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలు దవాఖానా సేవలను వినియోగించుకునేవారు. ఎన్నో ఏండ్లుగా ప్రజలకు సేవలందించిన భవనం క్రమక్రమంగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం భవనం పూర్తిగా నెర్రెలు బారి ఉన్నది. దవాఖాన లోపల పైకప్పు భాగంలో పెచ్చులూడిపోయి సీకులు తేలుతున్నాయి. రాలిపడే పెచ్చులు ఎప్పుడు ఎవరిపై పడతాయో తెలియని పరిస్థితి నెలకొనడంతో అటు సిబ్బంది.. ఇటు రోగులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పలుమార్లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా సమస్య మళ్లీ మొదటికొచ్చిందని సిబ్బంది వాపోతున్నారు. దవాఖానలో కిటికీలకు తలుపులు లేకపోవడంతో ఎండకు, చలికి, గాలికి, వానకు రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. రాత్రిపూట పాములు, తేళ్లు, జెర్రులు సంచరించిన సందర్భాలు కోకొల్లలుగా చెప్పవచ్చు. దీంతో రాత్రిపూట విధులు నిర్వహించే స్టాఫ్ నర్స్, అటెండర్, సెక్యూరిటీ గార్డ్స్ భయాందోళనకు గురవుతున్నారు. దవాఖాన ప్రాథమిక స్థాయి నుంచి వైద్యవిధాన పరిషత్ మారినప్పటికీ భవనం అసౌకర్యంగా ఉండటంతో సరిపడా పరికరాలు లేక రోగులకు ఆధునిక వైద్యం అందడంలేదు. నూతన భవనం నిర్మిస్తే తప్పా రోగులకు సరైన వైద్యం అందుబాటులోకి రాదని చెప్పవచ్చు. అధికారులు తగిన దృష్టి సారించి వెంటనే దవాఖాన నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ..

నూతన ప్రభుత్వ భవన నిర్మాణం శిలాఫలకానికే పరిమితమవుతుందా అనే సందేహాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో శిలాఫలకం వేసినప్పటి నుంచి మళ్లీ దాని గురించి పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. త్వరలో నూతన భవనం నిర్మిస్తే అన్ని రకాల వసతులతో ఆధునికమైన వైద్యం అందుతుందన్న ప్రజల కల కలగానే మిగిలింది. నిధులు మంజూరైనా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా సమస్య మిగిలిపోయింది. భూమి పూజ చేసి నెలలు గడుస్తున్నా దానికి దిక్కూమొక్కు లేకుండా పోయింది. ప్రజల ఆశ అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. నూతన భవన నిర్మాణ పనులు ఎప్పుడు మొదలైతాయో వేచి చూడాల్సిందే.

పెచ్చులూడుతున్న దవాఖాన పైకప్పు


నూతన భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలా ఫలకం

నిర్లక్ష్యం వీడాలి

దవాఖాన నూతన భవన నిర్మాణంలో నిర్లక్ష్యం వీడాలి. దవాఖాన భవన నిర్మాణ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. భవన నిర్మాణం విషయంలో ఉన్నతాధికారులను ఆశ్రయించి సమస్యను వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

- చిన్నోళ్ల జంగమ్మ, జడ్పీటీసీ, యాచారం

చర్యలు చేపట్టాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 8 : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు పక్కా ప్రణాళికతో ఉండాలని ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ పనుల్లో లేబర్ సమీకరణ చేస్తూ పద్ధతి ప్రకారం పనులు చేపడితే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చన్నారు. లేబర్ పనిచేసే చోట తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల ఏర్పాటు చేయాలన్నారు. రైతులు, గ్రామ ప్రజలను సమన్వయపరుచుకుంటూ పనులు జరిగేటట్లు చూడాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో లేబర్ ఉదయమే వెళ్లి 11.30 గంటల వరకు ఇంటికి తిరిగి వెళ్లేలా అధికారులు మానిటరింగ్ చేయాలన్నారు. లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉన్న గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులను ఎక్కువ మంది లేబర్‌ను పెట్టి చేయించాలన్నారు. లేబర్ తక్కువ ఉన్న గ్రామాలపై దృష్టి సారించి గ్రూప్ ఏర్పాటు చేసి, లేబర్ సమావేశాలు నిర్వహించి, అంచనా ప్రకారం కూలీల సంఖ్యను పెంచి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

10న 5కె రన్

వికారాబాద్ కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరిస్తూ ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి జోన్‌లో ఈ నెల 10న 5కె రన్ నిర్వహించనున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ శశాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు 5కె రన్ కొండాపూర్ బొటానికల్ గార్డెన్స్ నుంచి ప్రారంభమై హైటెక్స్ రోడ్ మెటల్ చార్మినార్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అన్ని వర్గాల వారు స్వచ్ఛందంగా 5కె రన్‌లో పాల్గొని ప్రజాస్వామ్య పరిణతి చాటాలన్నారు. వివిధ శాఖల అధికారులతో పాటు డ్వాక్రా సంఘాల సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో సీఈవో వికాస్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ
- పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 8 : ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సజావుగా నిర్వహించాలన్నారు. ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 25 నుంచి మే 2 వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు.. అదేవిధంగా మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు సంబంధించి వికారాబాద్‌లో 2, తాండూరులో 2 పరీక్షా కేంద్రాల్లో 691 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షలకు వికారాబాద్ 3, తాండూరులో 2 పరీక్షా కేంద్రాల్లో 1095 మంది పరీక్షలకు హాజరు హాజరు కానున్నట్లు తెలిపారు. కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద అత్యవసర మందులతో పాటు ఏఎన్ఎం, సిబ్బందిని నియమించాలని వైద్యాధికారికి సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా సమయాలను బట్టి విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను నడిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమీక్షా సమావేశంలో డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రామ్‌రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ సత్యనారాయణ, డిప్యూటీ పోస్ట్ మాస్టర్ రమేశ్, పోలీస్, ఆర్టీసీ శాఖల అధికారులున్నారు.

కృష్ణా పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కృష్ణా జలాల పైపులైన్‌కు మరమ్మతులు

- వెల్డింగ్ పనులతో లీకేజీలకు చెక్
- నమస్తే తెలంగాణ కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

యాచారం, ఏప్రిల్ 8 : కృష్ణా జలాలు వృథా అనే శీర్షికన ఈ నెల 3న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని తక్కళ్లపల్లిగేటు వద్ద నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్‌కు మూడు పైపులైన్‌ల ద్వారా తాగునీరు నిత్యం సరఫరా అవుతున్నది. అక్కడ వాగుపై బ్రిడ్జి ఉండటంతో ఐరన్ పైపులైన్ వేయాల్సి వచ్చింది. కొంత కాలం క్రితం పైప్‌లైన్ తుప్పు బట్టి రంధ్రాలు పడ్డాయి. రంధ్రాల ద్వారా ప్రతి నిత్యం తాగునీరు లీకేజీ అవుతున్నది. లీకేజీ నీటితో అక్కడ చిన్న వాగును తలపించేది. మండుటెండలో తాగునీటి కోసం నగర ప్రజలు అల్లాడుతుంటే అధికారుల నిర్లక్ష్యంతో నిత్యం కృష్ణాజలాలు వృథాగా పోతున్నాయి. దీంతో నమస్తే కథనానికి స్పందించిన హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు. పైపులైన్ లీకేజీలను అరికట్టేందుకు రంగంలోకి దిగారు. ఇనుప పైపులకు కవచాలు బిగించి నీరు వృథాగా పోకుండా వెల్డింగ్ పనులతో మరమ్మతులు చేశారు. దీంతో వృథాగా పోయిన కృష్ణా జలాల లీకేజీకి చెక్ పడడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భ్రమలు తొలిగాయి

- బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలను నమ్మి మోసపోయిన తెలంగాణ ప్రజలకు వాస్తవాలు తొందరగా అర్థమై భ్రమలు తొలిగిపోయాయని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోట్లాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ సారథ్యంలో పల్లెలు, పట్టణాలు శరవేగంగా అభివృద్ధి చెందడమే కాకుండా ప్రజలు సుభిక్షంగా జీవించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ రావడంతోనే కరువొచ్చిందని, ప్రజలకు తిరిగి అవస్థలు మొదలయ్యాయని పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీల పేరిట ఇచ్చిన 13 హామీలతో, కాంగ్రెస్ మానిఫెస్టోలో పొందుపర్చిన 420 హామీలను కాంగ్రెస్ పార్టీ అట్టకెక్కించిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన ఏ హామీలను అమలు చేయలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500, రైతు బంధు రూ.15వేలు, రూ.4000 నిరుద్యోగ భృతి, ఆసరా పింఛన్ల పెంపు, దివ్యాంగులకు రూ.6వేలు, ఉద్యోగులకు 4 డీఏలు, కౌలు రైతులకు రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, తదితర హామీలను వంద రోజుల్లోగా అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు దాటవేత ధోరణి అవలంబిస్తున్నదని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టనున్నారని, అబద్ధాలతో ఎల్లకాలం కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేయలేదని పేర్కొన్నారు. భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ విజయం కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామని, దాని కోసం ఈ నెల 12న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ జిల్లా మాజీ చైర్మన్ రమణారెడ్డి, మండల మున్సిపల్ అధ్యక్షులు కిషన్‌గౌడ్, రాములు, జంగయ్య, వెంకట్‌రెడ్డి, దామోదర్, బాషా, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, బహదూర్, నాయకులు రాజు, శేఖర్ ఉన్నారు.

అండగా ఉంటా.. ఆదుకోండి..

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్
- ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 8 : ఈ ప్రాంతానికి చెందినవాడిని.. మీలో ఒక్కడిగా ఉంటూ.. మీ అందరికీ ఎల్లప్పుడు అండగా ఉంటానని.. వచ్చే ఎన్నికల్లో మీ అందరి సహాయ సహకారాలతో తనను గెలిపించాలని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ కోరారు. సోమవారం రాత్రి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలంతా తనకు ఎంతో ఆప్తులని అన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మీ అందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రంజాన్ పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి పేద ముస్లింలకు దుస్తులతో పాటు ఇఫ్తార్ విందును కూడా ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. అలాగే, షాదీముబారక్ ద్వారా పేద ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించిందన్నారు. మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు, చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించి వారి ఆర్థిక బలోపేతానికి ఎంతగానో కృషిచేసిందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలిచ్చిందని.. ఏ ఒక్క హామీ కూడా అమలు జరుగలేదన్నారు. కేవలం బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరి నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న తనకు ముస్లిం మైనార్టీలంతా అండగా నిలువాలని ఆయన కోరారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

చిట్టిదే కానీ.. గాలి గట్టిగనే..

తట్టిఅన్నారం-కుంట్లూరు ప్రధాన రహదారిపై విక్రయిస్తున్న ఫ్యాన్లు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 8 : ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వేడి నుంచి తప్పించుకునేందుకు జనం అనేక మార్గాలను వెతుకుతున్నారు. జిల్లాలో రెండు మూడు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగానే నమోదవుతుండటంతో వేడి నుంచి ఉపశమనం కోసం తహతహలాడుతున్నారు. ఇందులో భాగంగానే కూలర్లు, ఏసీలకు మస్తు డిమాండ్ ఏర్పడింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొంచమే స్థలం ఉండి తప్పని పరిస్థితుల్లో అక్కడే కూర్చొని పనిచేయాల్సి వస్తున్నవారు ఎక్కువే ఉంటున్నారు. కూలర్లు, ఏసీలు ఏర్పాటు చేసుకునేందుకు స్థలం లేని, వసతులు లేని వారు కొత్తగా ఆలోచిస్తున్నారు. అరచేతి పరిమాణంలో ఉన్న ఫ్యాన్‌ల కొనుగోలు వైపు మొగ్గుచూపుతున్నారు. అందుకు అనుగుణంగానే మార్కెట్‌లోకి ఈ తరహా చిట్టి ఫ్యాన్‌లు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. దుకాణాలతోపాటు రోడ్ల పక్కనే వీటిని విక్రయిస్తున్నారు. అరగంట చార్జింగ్ పెడితే, రెండు నుంచి మూడు గంటలు పనిచేస్తుందని విక్రయదారులు చెబుతున్నారు. రూ.350కి ఒకటి చొప్పున అమ్ముతున్నామని అంటున్నారు. ఈ ఫ్యాన్‌లు తట్టిఅన్నారం-కుంట్లూరు ప్రధాన రహదారిపై కనిపించాయి.

ఉగాది శుభాకాంక్షలు

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 8 : జిల్లా ప్రజలకు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. క్రోధి నామ సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఉగాది ప్రజలందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ నూతన సంవత్సరం కొత్త ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని, ఉజ్వల భవిష్యత్తును అందించాలని అభిలషించారు. అన్ని వర్గాల ప్రజలకు శాంతి, శ్రేయస్సు, సామరస్యం, సంతోషాన్ని కలిగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

రంగారెడ్డి, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : మహేశ్వరం మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేసేందుకు అర్హులైన స్థానిక అభ్యర్థులకు ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిక కమిటీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఉద్యోగ వివరాల కోసం వెబ్‌సైట్‌ను చూడాలని.. ఇంటర్వ్యూలు ఈ నెల 10న శివరాంపల్లిలోని డీఎంహెచ్‌వోలో ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు.

ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి

రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ

వికారాబాద్, ఏప్రిల్ 8 : తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన విజయేంద్ర బోయ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రత్యేక అధికారి విజయేంద్ర బోయ వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మలతో కలిసి తాగునీటి సరఫరాపై జడ్పీ సీఈవో, డీపీవో, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేంద్ర బోయ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, దీనిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యతనిస్తూ అనునిత్యం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు.అవసరమైన చోట నీటి రవాణా కోసం ట్యాంకర్లను వినియోగించాలని తెలిపారు. జిల్లాలోని మండలాల పరిధిలో గల నివాస ప్రాంతాలకు సరిపడా నీటి నిలువలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్న అంశం మీ అందరికీ అవగాహన ఉండాలని, అవగాహన ఉంటే సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో నీటి సరఫరా తీరును అనునిత్యం పర్యవేక్షణ జరపాలని ఆమె సూచించారు.

పరిగి : అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ప్రత్యేకాధికారి విజయేంద్ర బోయ

తాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా కలెక్టరేట్‌లో తాగునీటి కోసం హెల్ప్ డెస్క్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ పరిధిలో ప్రతి ఒక్కరి తాగునీటి సమస్యను తెలుసుకునేందుకు వీలుగా 08416-242136 టోల్ ఫ్రీ నంబర్ హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల ప్రాంతాలను సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, జడ్పీ సీఈవో సుధీర్, డీపీవో జయసుధ, డివిజనల్ పంచాయతీ అధికారులు సంధ్యారాణి, శంకర్‌నాయక్, మిషన్ భగీరథ డీఈలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా సమస్యలు పరిష్కరించాలి

పరిగి : నీటి ఎద్దడి లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని విజయేంద్ర బోయ అధికారులను ఆదేశించారు. పరిగి మండలంలోని రాఘవాపూర్‌లో గల మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, మిషన్ భగీరథ అధికారులతో కలిసి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవాపూర్‌లోని నీటి శుద్ధి కేంద్రం నుంచి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ ప్రాంతాల్లోని 755 గ్రామాలకు తాగునీటిని అందించనున్నట్లు అధికారులు జిల్లా ప్రత్యేకాధికారికి వివరించారు. మిషన్ భగీరథ నీరు అందించడంలో అనుకోకుండా ఇబ్బందులు కలిగినప్పుడు ప్రత్యామ్నాయంగా తాగునీటిని అందించేందుకు వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకొని తాగునీటి సరఫరా చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఉండకుండా బోర్లు, చేతిపంపులను మరమ్మతులు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్‌లు పగిలిపోయినట్లయితే అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చేయించాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బాబు శ్రీనివాస్, చల్మారెడ్డి, మిషన్ భగీరథ డీఈ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.